విచ్చలవిడిగా మొరం తరలింపు

- మాయమవుతున్న పచ్చని అడవులు
- పట్టించుకోని అధికారులు

మాక్లూర్: అనుమతులు ఉన్నా లేకపోయినా మండలంలోని చిన్నాపూర్, మాదాపూర్, సింగంపల్లి, దాస్‌నగర్ శివారులలో కొందరు చేస్తున్న మొరం దందా వల్ల పచ్చని చెట్లతో ఉన్న అడవులు అంతరించిపోతున్నాయి. రాత్రి పూట అటవీ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని అక్రమంగా మొరం తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ప్రాణ వాయువును ఇచ్చే అడవులు కొందరు మొరం వ్యాపారుల వల్ల మైదాన ప్రాంతాలుగా మారుతున్నాయని, ఇలాగే కొనసాగితే కాలుష్య కోరల్లో చిక్కుకోవటం ఖాయమని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మాణిక్‌భండార్ వద్ద ఉన్న సుఖ్‌జిత్ ఫ్యాక్టరీ వదిలే పొగ వల్ల ఊపిరితిత్తులకు సంబంధించిన జబ్బులతో ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిన్నాపూర్, సింగంపల్లి, మాదాపూర్ ప్రాంతాల్లో పచ్చని చెట్లతో ఉన్న కొద్దిపాటి అడవి కూడా మాయం అయితే కాలుష్య కోరల్లో చిక్కుకొని త్వరలోనే మృత్యువాత పడే అవకాశం ఉందని పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అడవులను కొల్లగొడుతూ మొరం తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని శివారు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చిన్నాపూర్ అడవిలో చెట్లను కూల్చి మొరం తవ్వుతున్న దృశ్యం

కఠిన చర్యలు తీసుకోవాలి

చిన్నాపూర్, సింగంపల్లి, మాదాపూర్ ప్రాంత అడవులు నగరానికి దగ్గరగా ఉన్నాయి. ఇప్పటికే సుఖ్‌జిత్ ఫ్యాక్టరీ వదిలే పొగ వల్ల ఈ ప్రాంత ప్రజలు ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధుల బారిన పడుతున్నారు. ఉన్న కాస్త అడవులు మొరం వ్యాపారుల చేతుల్లో మాయమైతే శివారు గ్రామాల ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటారు. ఈ విషయమై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సుధీర్ సింగ్, స్థానికుడు

దళారులకు అమ్మి మోసపోవద్దు



రుద్రూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోచారం సురేందర్ రెడ్డి



దూపల్లిలో ప్రారంభిస్తున్న విండో చైర్మన్ భూంరెడ్డి

జిల్లాలో పలు చోట్ల సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..క్వింటాల్ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2060, బీ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,040 ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. దళారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని రైతులకు సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు.

నేడు చందూర్‌లో ప్రారంభం

రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు ప్యారం అశోక్ తెలిపారు. తొందరపడి దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని సూచించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



రుద్రూర్: ప్రకటనలకే పరిమితం కాకుండా అకాల వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని టీపీసీసీ సభ్యుడు, బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాసుల బాలరాజ్ డిమాండ్ చేశారు. మోస్రా మండలం గోవూర్, తిమ్మాపూర్, చింతకుంట గ్రామాల్లో సోమవారం మండల కాంగ్రెస్ నాయకులతో కల్సి పర్యటించారు. ధాన్యం కల్లాల్లోకి వెళ్లి రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.

క్లుప్తంగా

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ట్రాన్స్‌కో డీఈ కార్యాలయంలో సోమవారం టీఎస్‌పీఈ ఆర్మూర్ డివిజన్ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మె పోస్టర్‌లను డీఈ హరిచంద్ నాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సమస్యల సాధనకై ఈనెల 17న సమ్మెను ట్రేడ్ యూనియన్‌లు 1104, 327, బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ పవర్ డిప్లొమా అసోసియేషన్లు కలిసి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జేఏసీ చైర్మన్ నరేందర్ నాయక్, జేఏసీ కన్వీనర్ సల్ల శ్రీనివాస్, ఏడీఈ శ్రీధర్ పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా రవిగౌడ్



మాక్లూర్: బీజేపీ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన రవిగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి పార్టీ జిల్లా నాయకుడు గంగోనే సంతోష్, మండల అధ్యక్షుడు కాలగడ్డ వినోద్‌లు నియమాకపు పత్రాన్ని రవిగౌడ్‌కు అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



మాక్లూర్: మదన్‌పల్లి గ్రామానికి చెందిన దుంపటి ఒడ్డెమ్మకు మంజూరైన రూ.12,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును సోమవారం స్థానిక సర్పంచ్ ఎనుగంటి శంకర్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాస మహేష్, పంచాయితీ కార్యదర్శి మహేష్, శ్రీనివాస్, బాస్కర్, పోతన్నలు పాల్గొన్నారు.

మెండోరా పరిధిలో..

బాల్కొండ: మెండోరా మండల పరిధిలో పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తలారి గంగాధర్, నాయకులు కమలాకర్, సాయారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా, షాదీ ముబారక్ చెక్కులు..

రుద్రూర్: ప్రభుత్వం సరాఫరా చేసిన రంజాన్ తోఫాను రుద్రూర్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో లబ్ధిదారులకు జెడ్పీటీసీ నరోజీ గంగారాం, తహసీల్దార్ ముజీబ్‌లు పంపిణీ చేశారు. ముగ్గురికి షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఖాదర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన్, విండో డైరెక్టర్ సుభాని, నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, పత్తి రాము, అక్కపల్లి నాగేందర్, సయ్యద్, గులాబ్ పాల్గొన్నారు.

పాలాభిషేకం



మోర్తాడ్: మోర్తాడ్‌లో నేషనల్ అకాడమీ కనస్ట్రక్షన్(న్యాక్) సెంటర్ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ మోర్తాడ్‌లో సోమవారం సీఎం కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డిల ఫొటోలకు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు బద్దం రవి, సర్పంచ్‌లు భోగ ధరణి, చిన్నారెడ్డి, సహకార సంఘం చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది విద్యార్థుల గైర్హాజరు

వర్ని: సోమవారం నిర్వహించిన పదవ తరగతి సైన్స్ పరీక్షకు వర్ని మండలంలో నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్ని ఎంఈవో శాంతకుమారి వెల్లడించారు. వర్ని జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ముగ్గురు, జాకోరా కేంద్రంలో ఒకరు పరీక్షలకు హాజరు కాలేదని ఆమె వెల్లడించారు. అలాగే చందూర్‌లో ఒకరు, మోస్రాలో ఇద్దరు, రుద్రూర్ పరీక్ష కేంద్రంలో ఒకరు గైర్హాజరైనట్లు తెలిపారు.

సక్సెస్ డిగ్రీ కాలేజ్ విద్యార్థుల ప్రతిభ



ఆర్మూర్: పట్టణంలోని సక్సెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల విడుదలైన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ గిరిరాజ్, డైరెక్టర్ ప్రవీణ్ రాజ్, ప్రిన్సిపాల్ గంగాధ అభినందించారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): బీజేపీ పటిష్టతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి అన్నారు. పెర్కిట్‌లోని ఎంపీ అర్వింద్ నివాసంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు జెస్సు అనిల్ ఆధ్వర్యంలో పార్టీ, మోర్చాల వ్యవస్థాగత బాధ్యతలో మార్పులు చేసి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జీవీ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో బీజేపీను గెలిపించుకోవాలని కోరారు. అనంతరం బీజేపీ ఆర్మూర్ పట్టణ ఉపాధ్యక్షుడిగా మీసాల రాజేశ్వర్, ఆర్మూర్ పట్టణ కార్యదర్శులుగా పులి యుగంధర్, గుగులోత్ తిరుపతి నాయక్‌ను, దళిత మోర్చ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడిగా కౌన్సిలర్ బ్యావత్ సాయికుమార్, కార్యదర్శిగా కిష్టయ్యను నియామిస్తూ పత్రాలను అందజేశారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



నియామక పత్రాలను అందజేస్తున్న నర్సింహారెడ్డి

అభివృద్ధి పనులు చేపట్టాలి

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో అక్రమాలు, అవినీతి పాల్పకుండా ఆర్మూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలోని ఫౌంటెయిన్, నవనాథ సిద్ధుల విగ్రహాలకు మరమ్మతులు చేయాలని బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ సంవత్సరం నుంచి పనిచేయడం లేదని గుర్తు చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

తై బజార్ వేలం



బాల్కొండ: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే తై బజార్‌కు సోమవారం గ్రామ పంచాయతీలో వేలం నిర్వహించారు. మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన మహ్మద్ షఫీ రూ.4 లక్షల 52 వేలకు తై బజార్‌ను దక్కించుకున్నారు. గతంలో వేలం పాటలో రూ.6.25 లక్షలకు దక్కించుకున్న స్థానికుడు అగ్రిమెంట్ కోసం ముందుకు రాకపోవడంతో తై బజార్ వేలం రద్దు చేసిన విషయం తెలిసిందే. సర్పంచ్ బూస సునీత, ఉప సర్పంచ్ వాహబ్, ఈవో రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్త తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పలు వార్డులో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని సోమవారం 'సాక్షి' దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. మున్సిపల్ అధికారులు స్పందించి ఔటి గల్లీలో రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించారు. అలాగే కాలనీవాసులు ఇకపై ఆ స్థలంలో చెత్త వెయ్యవద్దని, మున్సిపల్ చెత్త సేకరణ వాహనాల్లోనే వేయాలన్నారు.

ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ

ఈ నెలాఖరు వరకు అవకాశం

ఆర్మూర్‌టౌన్: పురపాలక సంఘాల్లో ఏప్రిల్‌లో ఆస్తి పన్నులు చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ ఇస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సవారికి ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పించారు. ఇందుకు సంబంధించిన ఎర్లీ బర్డ్ పథకాన్ని అమలు చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆస్తిపన్నులు చెల్లించే వారు ఈ నెల 30 లోపు పన్నులు చెల్లించి 5 శాతం రాయితీ పొందవచ్చు. ఇది 2022–23 ఆర్థిక సంవత్సరంలో బకాయిలు లేని వారికి మాత్రమే ఈ అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



ఆర్మూర్ మున్సిపల్ అభివృద్ధిలో ముందుకెళ్లాలంటే ప్రజల సహకారం కచ్చితంగా ఉండాలి. పన్నులు సకాలంలో చెల్లించి ప్రభుత్వ అందిస్తున్న రాయితీని పొందవచ్చు. ఈ నెల 30 వరకు గడువు ఉంది.

– ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

అంతిమ సంస్కారాలకు ధర్మ స్థలం సౌకర్యం

- బోధన్ ఆర్డీవో రాజేశ్వర్

బోధన్‌టౌన్(బోధన్): అద్దె ఇంట్లో ఉండి మరణించిన వారి అంతిమ సంస్కారాలకు ఇబ్బందులు కలిగితే ధర్మస్థలంలో ఉండి అంతిమ సంస్కారాలు చేసుకోవచ్చని ఆర్డీవో రాజేశ్వర్ తెలిపారు. పట్టణంలోని ఆజాంగంజ్ కాలనీలో గల హిందూ శ్మశానవాటిక ఆవరణలో విశ్రాంత ఉపాధ్యాయురాలు సరోజినమ్మ విరాళంగా ఇచ్చిన రూ.16 లక్షలతో నిర్మించిన నూతన ధర్మ స్థలం భవనాన్ని దాత చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడారు. అద్దె ఇళ్లలో ఉంటూ మృతి చెందితే అద్దె ఇంటి యజమానులు అంతిమ సంస్కారాలను జరపవద్దని, అరిష్టం జరుగుతుందని భావించి అడ్డుకున్న ఘటనలను ఆయన ఉదహరించారు. ఇలాంటి ఘటనలకు చలించి సరోజినమ్మ తన సొంత డబ్బులతో ధర్మస్థలం నిర్మాణానికి 6 నెలల క్రితం పూనుకుందని పేర్కొన్నారు. దాత పెద్ద మనసుకు పట్టణ ప్రజలు, ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నానని వివరించారు. త్వరలో ఈ భవనాన్ని బల్దియా ఆధీనంలోకి తీసుకొని పర్యవేక్షిస్తుందని తెలిపారు. అనంతరం దాత సరోజినమ్మను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, కౌన్సిలర్ అంకు సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.



ధర్మ స్థలం దాత సరోజినమ్మను సన్మానిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్, తదితరులు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మానం

బోధన్‌టౌన్(బోధన్): ధర్మస్థలం భవనాన్ని తన సొంత డబ్బులతో నిర్మించిన దాత విశ్రాంత ఉపాధ్యాయురాలు సరోజినమ్మను యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి మాట్లాడారు. పెద్ద మనస్సుతో సరోజినమ్మ చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కౌన్సిలర్ సంధ్యా దాము, ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్ సురేందర్ గౌడ్ పాల్గొన్నారు.

ఐదు చోట్ల చలివేంద్రాల ప్రారంభం



బోధన్‌లో చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి

బోధన్‌టౌన్(బోధన్): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడారు. వేసవిలో ప్రజల దాహం తీర్చేందుకు పట్టణంలోని రాకాసీపేట్, అంబేడ్కర్ చౌరస్తాతో పాటు ఇతర ప్రాంతాల్లో 5 చలివేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. చైర్ పర్సన్ వెంట కౌన్సిలర్‌లు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు నిలయం శిశుమందిర్

బోధన్‌టౌన్(బోధన్): హిందూ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయం సరస్వతి శిశుమందిరాలని వైద్యులు శైలేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీ సరస్వతి శిశు మందిర్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్యులు హాజరై మాట్లాడారు. శిశు మందిరంలో విద్యతో పాటు సంస్కృతి, హైందవ ధర్మాన్ని నేర్పిస్తారని వెల్లడించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, శిశుమందిర్ కమిటీ కార్యదర్శి పబ్బ మురళి పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

రైతు సంక్షేమంలో ఆదర్శంగా నిలిచాం

- మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీని నమ్మొద్దు
- బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమేర్

బోధన్‌రూరల్(బోధన్) : రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయనికి ఉచిత కరెంట్, రైతులు పంటలను అమ్ముకునేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి పనులతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమంలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమేర్ అన్నారు. సోమవారం బోధన్ ఏఎంసీలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమేర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ మాట్లాడుతూ.. రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్ముకుని నష్టపోవద్దని ఆయన సూచించారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేక బీజేపీ, కేంద్ర ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ దుష్ట రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. తెలంగాణ రాకముందు మన పరిస్థితి తెలంగాణ వచ్చిన తర్వాత మారిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు గమనించాలన్నారు. అంతకుముందుకు ఎమ్మెల్యే షకీల్ ఏఎంసీ ఆవరణంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని శ్రీ హరే కృష్ణ భక్తులు ఎమ్మెల్యే షకీల్‌ను కోరారు. సానుకూలంగా స్పందించి స్థలం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షకీల్

రంజాన్ ప్రార్థనల కోసం ఏర్పాట్ల పరిశీలన

బోధన్ పట్టణ శివారులోని ఈద్గాను ఎమ్మెల్యే షకీల్, ముస్లిం మతపెద్దలు, అధికారులతో కలిసి సందర్శించారు. ఏర్పాట్లపై వారితో కలిసి చర్చించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంపీపీ బుద్దె సావిత్రి, వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయి, వైస్ చైర్మన్ ఎండీ షకీల్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్, ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ వర ప్రసాద్ పాల్గొన్నారు.

పంప తరంగాలు పుస్తక ఆవిష్కరణ

బోధన్‌టౌన్(బోధన్): పంప సాహితీ పీఠం ఆధ్వర్యంలో రచించిన పంప తరంగాలు 5వ భాగం పుస్తకాన్ని సోమవారం ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ తన ఇంట్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బోధన్‌లో కన్నడ ఆది కవి పంప సాహితి పీఠం ఉండటం ఎంతో గర్వకారణమన్నారు. సాహితి పీఠం ఆధ్వర్యంలో కవులు, రచయితలను ప్రోత్సహించడం అభినందనీయం అన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే కవులు, రచయితలతోనే సాధ్యమవుతుందని వెల్లడించారు.

కార్యక్రమంలో పంప సాహితీ పీఠం అధ్యక్షులు అజయ్ కుమార్, కార్యదర్శి పబ్బమురళి, తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

సంక్షిప్తం

వ్యక్తిగత దూషణలు కాదు.. సద్విమర్శ ఉండాలి

రుద్రూర్: అధికార పార్టీ పనితీరును ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సిందిగా పోయి బూతులు వల్లిస్తారా..? అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ మండిపడ్డారు. రుద్రూర్ మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను ఖండించారు. సమావేశంలో రాయకూర్ విండో వైస్ చైర్మన్ తోట అరుణ్ కుమార్, ఎంపీటీసీలు గౌస్, మనోహర్, తదితరులున్నారు.

నేలకొరిగిన పంటల పరిశీలన

ఎడపల్లి(బోధన్): మండలంలోని మంగళ్‌పాడ్ శివారులో నేలకొరిగిన వరి పంటను సోమవారం వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్ పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఈద్గాలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంతో పాటు మామిడిపల్లి, పెర్కిట్ ఈద్గాలలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతకు మర్కజ్ కమిటీ సభ్యులు సోమవారం వినతి పత్రం అందజేశారు. రంజాన్ రోజు తాగునీరు, నీడ కోసం టెంట్లు వేయాలని కోరారు.

లక్కోరలో ఇంటింటికి బీజేపీ

వేల్పూర్: లక్కోరలో సోమవారం బీజేపీ నాయకులు పల్లెపల్లెకు ఓబీసీ– ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఓబీసీ కరపత్రాలను ఇంటింటికి పంచిపెట్టారు. తెలంగాణ ప్రభుత్వం ఓబీసీలను అణచివేస్తోందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు డమాంకర్ శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు లక్ష్మణ్, రాగి ప్రభాకర్ పాల్గొన్నారు.

బీరప్ప స్వామి కల్యాణోత్సవం

నందిపేట(ఆర్మూర్): కొందపురంలో కురుమల ఆరాధ్యదైవం బీరప్ప స్వామివారి కల్యాణోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో నందిపేట్ ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీపీ సంతోష్ రెడ్డి, కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవన్న, కొందపురం సర్పంచ్ సాయన్న, ఎంపీటీసీ ప్రవీణ్ గౌడ్, తల్వేద ఎంపీటీసీ రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ప్రతి ఒక్కరు కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 15, 25వ వార్డుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెండవ విడుత కంటి వెలుగు శిబిరాన్ని చైర్‌పర్సన్ వినీత ప్రారంభించారు. కౌన్సిలర్ గంగామోహన్‌చక్రు, ఆరోగ్య, మున్సిపల్ శాఖాధికారులు పాల్గొన్నారు.

కారేగాం తండాలో..

రుద్రూర్: చందూర్ మండలం కారేగాం తండాలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కవిత అంబర్‌సింగ్, స్థానిక సర్పంచ్ దేవిసింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో..

మోర్తాడ్: తిమ్మాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ గడ్డం చిన్నారెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహిపాల్ పాల్గొన్నారు.